


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**114**

(17ʻ జనవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**నూతన** సంవత్సరం రాగానే చాలామంది తమ జీవితాల్ని సింహావలోకనం చేసుకుని కొన్ని అలవాట్లైన పొరపాట్లను సరిచేసుకోవడం కోసం ప్రయత్నించడం సహజం. అలాగే కొన్ని మంచి కార్యక్రమాల కోసం తాపత్రయపడటం, ఎంత యిబ్బంది అయినాసరే వాటిని దీక్షగా నిర్వహించాలని పట్టుబట్టడం జరుగుతూ ఉంటుంది.

వీటినే నూతన వత్సర తీర్మానాలంటారు. వీటిద్వారా జీవితంలో కొంత ప్రశాంతతా, శక్తి వాటితోపాటు కొంత వికాసం సంపాదించడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. అయితే, ఈ తీర్మానాల రూపాలు ఎలా ఉంటాయి? అని ఎంతవరకు నెరవేరతాయి? అనేది ఆలోచించాలి.

ఈ సందర్భంలో ఒక గృహస్థుణ్ణి కలుసుకుని "మీరు నూతన వత్సర తీర్మానం ఏం చేశారు?" అని ప్రశ్నించాను. ఆయన నవ్వి, "తీర్మానించాను గట్టిగా తీర్మానించాను. ఈ వత్సరంలో అప్పు చెయ్యకుండా, ఉన్న సొమ్మునే పొదుపుగా వాడుకుందామని గట్టి పట్టుబట్టాను. చివరకు కారం మెతుకులు తిన్నాసరే పరాయివాడికి పైసా అప్పు ఉండకూడదు అని నిశ్చయించాను" అన్నారాయన.

"చాలామంచి తీర్మానం. మీ తీర్మానం అమలు జరిగితే మీ అంత అదృష్టవంతుడు. గొప్పవాడవయ్యా అంటే అప్పుచెయ్యనివాడు - అని శాస్త్రం ఉంది. మీరా గొప్పతనం సంపాదించబోతున్నారన్నమాట" అన్నాను.

"అప్పుడే పొగడకండి. దేశంలో అనేకమంది చేసే తీర్మానాలలాగానే నా తీర్మానం కాగితం మీదకు బదులు మనసులోనే ఉండిపోయింది. ఫస్టు తారీఖునాటికి రావలసిన చెక్కు పదో తారీఖు వచ్చినా రాలా. స్కూళ్ళకు సెలవులు గనుక, ఈ వారంలో రోజుకు సగటుకు అయిదుగురు చొప్పున చుట్టాలొచ్చారు. ఎట్లా చెప్పండి?" అన్నారాయన.

"గట్టి చిక్కే వచ్చింది. మరి ఎలా సమర్థించారు?" అన్నాను.

"ఏం సమర్థించను? ఎవర్ని కాదనగలను? మూడు పూటలా అప్పుకోసం బయలుదేరక తప్పలేదు. ప్రతిరోజూ పోస్టుకోసం ఎదురు చూడడం అది వచ్చి వెళ్ళగానే ముష్టికోసం బయలుదేరడం ఇలా నడిచాయి ఈ పదిరోజులూ. అంతో, ఇంతో ఇళ్ళల్లో సొమ్ముదాచండే, ఇలాటి తీర్మానాలు హఠాత్తుగా చేయకూడదండీ" అన్నారాయన.

"నిజమే మరి సంసారాలు నడపడం యుద్ధంలో విమానాలు నడపడం కంటే ప్రమాదకరంగా ఉంది" అన్నాడు.

"అయినా పట్టుదల వదలలేదు లెండి. నిన్ననే మా ఆవిడ ఒక ఎమెండ్‌మెంట్ పెట్టింది. "అత్యవసర సమయాలలో, చెక్కులు పంపుతామని వ్రాసి ఇతరులు అబద్ధాలాడటం, ఆలస్యం చెయ్యడం జరిగినప్పుడు ఒక వందదాకా అప్పుచెయ్యవచ్చుననేదే దాని సారాంశం" అన్నారాయన. నూతనవత్సర తీర్మానాలంటే జ్ఞాపకం వచ్చింది. వెనుకటికి ఒకాయన ఎప్పుడూ భార్యను తిట్టిపోస్తూ వుండేవాడట.

బంధువులూ, మిత్రులూ అలా చెయ్యడం చాలా తప్పనీ, ఆవిడ లోలోపల చాలా బాధపడుతుందనీ మందలించారుట. మొత్తం మీద ఆయన మనస్సు మారింది.

క్రొత్త సంవత్సరం రాగానే ఎంత కోపం వచ్చినా భార్యను తిట్టకూడదని తీర్మానించుకున్నాడుట. అంత మహత్కార్యం తలపెట్టాననే సంతోషంలో భార్యను పిలిచి తన నిశ్చయం తెలియచేశాడుట. ఆవిడ "తీర్మానాల వల్ల ఏమవుతుంది. ఇన్నాళ్ళుగా తిడుతున్న మిమ్మల్ని ఏ తీర్మానాలు ఆపగలవు. నేను నమ్మను" అందట.

"అలా సంశయించవద్దు. ఇదేం ఒట్టి తీర్మానం కాదు. కావలిస్తే భగవంతుని తలిచి ఒట్టు పెట్టుకుంటా" నన్నాడుట భర్త.

"మీరు ఒట్టును కూడా లెక్కచెయ్యరని తెలుసుగాని. అయినా అలా చెయ్యండి. చూద్దాం కొంతకాలం" అన్నది భార్య.

ఆయన దేవుణ్ణి తలచి "ఎట్టి పరిస్థితిలో నా భార్యని తిట్టను" అని గట్టిగా ఒట్టుపెట్టుకున్నాడు. ఆవిడ ఎంతో ఉప్పొంగిపోయింది. ఆవిడ సంతోషం చూచి ఆయన ఆనందించాడు. ఇన్నాళ్ళు తిట్టబట్టి కావన్ను అలా కుదించుకుపోయింది. రేపటినుంచీ వన్నెల విసనకర్రలాగా మెసులుతుంది యింట్లోనని సంబరాలు పడ్డాడు.

కానీ ఫలితం మరోవిధంగా జరిగింది. మర్నాడు ఉదయం కాఫీ కాస్తూ ఆవిడ భర్తను పిలిచి - "ఏమిటీ కాఫీపొడి వెధవపొడి. చింతగింజల పొడికన్నా అధ్వానంగా ఉంది. ఆ దుకాణదారుడు మీ ముఖం చూడగానే కనిపెడతాడల్లే ఉంది. ఏదిచ్చినా పట్టుకువెడతారు ఫర్వాలేదని. మీకంటే ప్రక్క యింటివాళ్ళ నౌకరే మంచి పొడి తెస్తాడు. మొన్న బదులు తెచ్చి చూశా"

ఆయనగారు గుడ్లు మిటకరించి "ఏమిటిది అనుకోకుండా దీని నోరు అటుకులరోకలయిపోయింద"ని ఆశ్చర్యపోయాడుట. తర్వాత వరుసగా ఆమె తిట్ల ప్రకరణం ప్రారంభించిందిట. ఆయన దిగులుపడి అడిగాడుట "ఏమిటిది? ఇలా తిట్లు సాగించావు. నా అంతవాణ్ణి నేనే మానేశాగదా" అని.

"అందువల్లనే నండి నే ప్రారంభించాను. తిట్టనని దేవుడు దగ్గిర ఒట్టు పెట్టుకున్నారుగా. దాంతో కొండంత ధైర్యం వచ్చింది. కొన్నాళ్ళు మీరు అనుభవిస్తే మంచిదని ప్రారంభించాను అని ఆమె పకపకలాడుతూ చెప్పిందిట.

ఒకావిడ క్రొత్త సంవత్సరం వస్తూందనగా భర్తతో "మీరీ క్రొత్త సంవత్సరం వచ్చినప్పటి నుంచి సాయంత్రం ఆరుగంటలకల్లా ఇంటికి వస్తూ ఉండాలండి. లేకపోతే చాలా చిక్కుగా వుంది. ముఖ్యంగా పిల్లల విషయంలో" అని దీనంగా అడిగిందిట.

ఆయనగారి మనస్సు కరిగి అలాగే వస్తానని వాగ్దానం చేసి, ఫస్టు తారీఖు రాగానే ఆరింటికి వచ్చాడట. భార్య ఇంట్లో కనిపించలేదు. పిల్లల్ని పిలిచి "అమ్మ ఏది?" అని అడిగాడుట. వారలా చెప్పారుట "అమ్మ సినిమాకు వెళ్ళింది నాన్నా. ఇంతకుముందే మమ్మల్ని ఆడుకుంటూ ఉండండి ఆరుగంటలకల్లా నాన్న వస్తారని చెప్పింది. మాకు ఆకలైతే నీ చేత అన్నం పెట్టించుకుని తినమంది. ఆ తర్వాత మా పక్కలు మమ్మల్నే వేసుకుని నిద్రపొమ్మంది" అని.

ఈ ఇందీవరాక్షి ఇందుకా నన్ను ఆరుగంటలకల్లా రమ్మన్నదని ఆయన ఎంతో విచారించి ఆ రోజుకి పిల్లలకు అన్నం పెట్టి నిద్రకొట్టి మర్నాటి నుంచీ నాకు ఆఫీసు వర్కు రాత్రి ఎనిమిదింటిదాకా పొడిగించారీ క్రొత్త సంవత్సరం' దానికి మరికొంత డబ్బిస్తారు? ఎలా మానుకొను? అని భార్యకు చెప్పి.

మర్నాటి నుంచీ ఆరింటికల్లా క్లబ్‌కు హాజరుకావడం ప్రారంభించాడుట. చీట్ల పేకకోసం. ఎప్పుడో ఎక్కువ గెలిచిన రోజున ఒక యాభై రూపాయలు విడిగా పెట్టి, వాటిని జీతంతో కలిపి ఇవ్వడం ఆవిడ సంతోషించడం జరిగిందంట. భర్త సంపాదన పోగొట్టడం ఇష్టంలేక ఆ అన్నుల మిన్న ఒక్క ఆదివారాలు మాత్రమే సినిమాలకు వెళ్ళడానికి నిశ్చయించుకుందిట.

ఒకావిడ తీర్మానించుకొందిట. క్రొత్త సంవత్సరం వచ్చినప్పటినుంచీ పొరుగిళ్ళకు వెళ్ళడం, మానుకోవాలని. తీరా వెళ్ళిన తర్వాత అవతల వాళ్ళు ఏదో సూటీపోటీ మాటలు అనకమానరు. దానిమీద కోపం వచ్చి మనం ఏదో అనకమానం. కనుక ఎవరింట్లో వారు కూర్చోవడం ఎంతో మంచిదని ఆవిడ నిశ్చయించుకుంది.

క్రొత్త సంవత్సరం వచ్చింది. ఒకటవ తేదీ మధ్యాహ్నం దాకా ఇంట్లో కూర్చుంది. కానీ అలా కూర్చోవడం కొంచెం క్రొత్తగా తోచిందావిడకు. చివరకు ప్రక్కయింటికి బయలుదేరిందట. తన నిర్ణయం వారితో చెప్పి చక్కావద్దామని. సూటిపోటిమాటలు పడటం ఇష్టంలేక తాను అలా నిర్ణయించుకున్నానని వారితో చెప్పిందట.

అది విని వారు "రమ్మన్నదెవరు? వచ్చి ఏ వక్ర సంభాషణో తెమ్మన్నదెవరు? పైగా మేమేదో అంటున్నామని ప్రచారం చెయ్యడం దేనికి?" అని గట్టిగా చివాట్లు పెట్టారుట. అక్కడితో ముఖం చిట్లించుకుని యింటికి వచ్చింది ఇంటామె.

ప్రక్క ఇంటివారి మీద మంట చల్లారక మర్నాడు మరో యింటికి వెళ్ళి "చూశారా వాళ్ళలా అన్నారు. నేనసలు ఎవరింటికీ వెళ్ళకూడదనే నిశ్చయించుకున్నా. కానీ ఆ సంగతి చెప్పివద్దామని వెళ్ళా" అందిట.

ఆ ఇంటివారు ఆమె సోదంతా విని "నీ తీర్మానం చాలా బాగుంది. తల్లీ నువ్వు మా యింటికి రావద్దని మేమే చెప్పాలని ఎన్నాళ్ళ నుంచో అనుకుంటున్నాం. సాహసించలేక ఊరుకొన్నాం. నీకే ఆ బుద్ధి పుట్టినందుకు ఎంతో సంతోషంగా ఉంది. తీర్మానం పాటించు నీకెంతో పుణ్యం ఉంటుంది" అన్నారుట.

అక్కడితో ఇంటికి వచ్చిందిగాని ఆవిడ కోపం తగ్గలేదు.

"వీళ్ళింత మర్యాద లేకుండా మాట్లాడుతారా? వీళ్ళ సంగతి ఊరంతా చెప్పి అల్లరి చెయ్యాలి. తీర్మానం సంగతి తర్వాత ఆలోచిద్దాం. ఊరంతా తిరిగి వారిని యాగీచేసి ఏకంగా ఉగాది నుంచీ మానేస్తాను ఊరివెంట తిరగడం. మనకు క్రొత్త సంవత్సరం ఉగాదిగాని, జనవరి కాదుగా" అనుకుందిట.

క్రొత్త సంవత్సర తీర్మానాలు గాలిలో పేలాపిండిలాగా ఎలా ఎగిరిపోతాయో వివరించడానికి పై వ్యాసంలో మరికొన్ని ఉదంతాలు వ్రాస్తాను.

Post your comments